క్లుప్తంగా

విజయవాడ తరహాలోనే పరిహారం ఇవ్వాలని ధర్నా

ఇబ్రహీంపట్నం: వరద ముంపునకు గురైన ఇబ్రహీంపట్నం, కొండపల్లి ప్రాంతాల్లోని బాధితులకు విజయవాడ తరహాలోనే నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఫెర్రీలో బాధితులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. విజయవాడ ప్రాంతంలో ముంపునకు గురైన ఇళ్లకు రూ.25 వేలు ప్రకటించి ఈ ప్రాంతంలో రూ.10 వేలకు కుదించడం దారుణమని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. సీపీఎం నేత మహేష్ మాట్లాడుతూ కృష్ణానది వరద ప్రవాహంతో ఫెర్రీ, దుర్గాకాలనీ, ఆర్టీసీ కాలనీ, జగనన్న కాలనీ తదితర ప్రాంతాలు నీటి ముంపునకు గురయ్యాయన్నారు. బుడమేరు వాగు పొంగడం వలన శాంతినగర్ ప్రజలు నీటి ముంపుతో సర్వం కోల్పోయారని చెప్పారు. ఇంటికి రూ.25 వేలు చెల్లించకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పలువురు నాయకులు, బాధితులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో స్వచ్ఛతా హీ సేవా

ఆగిరిపల్లి: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి జాస్తి జగన్ మోహన్‌రావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో సిబ్బందితో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ రత్నబాబు, సూపర్ వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గంపలగూడెంలో 'వనం-మనం'



గంపలగూడెం: పర్యావరణ దినోత్సవం సందర్భంగా గంపలగూడెంలో శుక్రవారం వనం-మనం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ మెయిన్ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాల్లో సర్పంచి కోట పుల్లమ్మ, ఐసీడీఎస్ తిరువూరు ప్రాజెక్టు సీడీపీఓ సత్యవతి, సూపర్ వైజర్ మునిలక్ష్మీ, ఉప సర్పంచి కొల్లా నాగరాజు మొక్కలు నాటారు.

రేపు ఏచూరి సంతాప సభ

తిరువూరు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 22న సాయంత్రం 5 గంటలకు జరుగుతుందని పార్టీ పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్రప్రసాద్ తెలిపారు. సభకు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు పి. మధు, జిల్లా, రాష్ట్ర నాయకులు హాజరవుతారని చెప్పారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

నూజివీడు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీవైఈఓ ఎం. సేవియా అన్నారు. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయి బాలుర ఆటల పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో రాణించడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. అనంతరం బాలురకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, షటిల్, చెస్, యోగా పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎస్ఆర్ఆర్ హైస్కూల్ హెచ్ఎం బి.హేమలత, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే వసంత

మైలవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు అయిన సందర్భంగా వెల్వడం, తోలుకోడు, చంద్రగూడెం, రెడ్డిగూడెంలో 100 రోజుల పండుగను శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం నిత్యం కృషి చేస్తోందని చెప్పారు.

జాతీయ రహదారికి మరమ్మతులు చేయించాలి

ఎ.కొండూరు: విజయవాడ-తిరువూరు జాతీయ రహదారికి మరమ్మతులు చేయించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం రామచంద్రాపురం గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ విజయవాడ-తిరువూరు జాతీయ రహదారి రామచంద్రాపురం గ్రామం వద్ద గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. సీపీఎం నాయకులు జట్టి వెంకటేశ్వరరావు, పి. ఆనందరావు, పి. వెంకటేశ్వరరావు, టి. లక్ష్మయ్య, పి ముత్తయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 3 లక్షల చెక్కు

విస్సన్నపేట: వరద బాధితుల సహాయార్థం స్థానిక వికాస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో రూ.3 లక్షల చెక్కును సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేసినట్లు వికాస్ విద్యాసంస్థల అధినేత నరెడ్ల నర్సిరెడ్డి శుక్రవారం తెలిపారు. లక్ష రూపాయలు ఇంజినీరింగ్ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ద్వారా, రూ. రెండు లక్షలు ఆంధ్రప్రదేశ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్‌కి అందజేశామని నర్సిరెడ్డి చెప్పారు.

హామీలలో హీరోలు.. అమలులో జీరోలు

- ఉద్యోగాలు కల్పిస్తామంటూ వసంత ప్రగల్భాలు
- ఉన్న ఉద్యోగులను తొలగిస్తున్న వైనం
- 100 రోజులైనా కానరాని తాగునీటి సమస్య పరిష్కారం
- చింతలపూడి పూర్తికి ప్రయత్నం శూన్యం

సాక్షి, విజయవాడ: తాను పారిశ్రామికవేత్తనని, ఎమ్మెల్యేగా గెలిస్తే అనేక పరిశ్రమలను తీసుకొస్తానని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని, మూడు నెలల్లోనే తాగునీటి సమస్య పరిష్కరిస్తానని, ఐదు నెలల్లో చింతలపూడి పూర్తి చేస్తానని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని, వీటీపీఎస్ బూడిద సమస్యను పరిష్కరిస్తానని, మౌలిక వసతులు కల్పిస్తానంటూ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఎమ్మెల్యేగా గెలిచి 100 రోజులు అవుతున్నా హామీల అమలు దిశగా ఒక్క అడుగు కూడా వేయలేదు.

తన వారి కోసం ఉన్న ఉద్యోగుల తొలగింపు..

ఉద్యోగాలు ఇచ్చే మాట దేవుడెరుగు. ఉన్న ఉద్యోగులను తన వారి కోసం తొలగిస్తున్నారు. మధ్యాహ్న భోజనం ఏజెంట్లు, ఆయాలు, డ్వాక్రా బుక్ కీపర్లు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో ఫీల్డ్ అసిస్టెంట్లు, పాఠశాల వాచ్‌మన్లను దయాదాక్షిణ్యాలు లేకుండా ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. వీరి స్థానంలో కొత్తగా వారి అనుచరులను నియమించుకుంటున్నారు. ఏళ్ల తరబడి ఉద్యోగాలు చేసిన వారు ఉసూరుమంటున్నారు.

తాగు, సాగునీటి సమస్యకు పరిష్కారమేది?

తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మైలవరం నియోజకవర్గంలో ప్రధానంగా ఉన్న తాగు, సాగునీటి సమస్యను పరిష్కరిస్తానని వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రజలకు హామీ ఇచ్చారు. కానీ ఆ దిశగా ఒక్క అడుగు కూడా పడలేదు. మూడు నెలల్లో ఇబ్రహీంపట్నంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తానన్న ఎమ్మెల్యే పనులను ప్రారంభించలేదు. నియోజకవర్గానికి వరంగా ఉన్న చింతలపూడి ప్రాజెక్టు పది శాతం పనులను అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. కానీ అసలు ఆ ప్రాజెక్టు ఊసేలేదు. నియోజకవర్గంలో రహదారులు, డ్రెయినేజీలు వంటి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేయగా మిగిలిన 20 శాతం మందికి అధికారంలోకి రాగానే భూ సేకరణ చేసి ఇళ్ల స్థలాలు ఇస్తానన్న ఎమ్మెల్యే ఒక్క చోట కూడా స్థల సేకరణ చేయలేదు. సూపర్ సిక్స్ పథకాలతోనే మేలు జరుగుతుందని ఊదరగొట్టిన ఎమ్మెల్యే ఒక్క పథకం కూడా అమలు చేయకపోగా ప్రతిపక్ష పార్టీపై విమర్శలు గుప్పించడంపై నియోజకవర్గ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



సాగు, తాగునీటికే తొలి ప్రాధాన్యం!

మైలవరం నియోజకవర్గ కూటమి అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్

మైలవరం నియోజకవర్గానికి ఎమ్మెల్యే హామీలు ఇస్తూ ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూ క్లిప్పింగ్ (ఫైల్)



యువతకు ఉపాధే తెదేపా ప్రాధాన్యం

యువతకు ఉపాధి కల్పిస్తానంటూ ఎమ్మెల్యే వసంత ఇచ్చిన హామీపై ఈనాడులో వచ్చిన వార్త (ఫైల్)

బూడిద సమస్యకు పరిష్కారమేది?

గత ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న వసంత వెంకట కృష్ణప్రసాద్ వీటీపీఎస్ బూడిద సమస్యకు పరిష్కారం చూపకుండా బూడిదను తరలించి సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కానీ తాను ఎటువంటి అవినీతికి పాల్పడలేదని, వైఎస్సార్ సీపీలో ఓ నాయకుడే ఇదంతా చేశారంటూ అసత్యపు ప్రచారం చేశారు. తాను మరలా ఎమ్మెల్యేగా గెలిస్తే కొండపల్లి, ఇబ్రహీంపట్నానికి బూడిద సమస్యను పరిష్కరిస్తానని అబద్ధపు ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎమ్మెల్యే బామ్మర్దిగా చెప్పుకునే పోసాని కోటేశ్వరరరావు లైన్లోకి వచ్చారు. బూడిదను అక్రమంగా తరలించడం ప్రారంభించారు. కానీ ఆ సమస్యకు పరిష్కారం చూపే ప్రయత్నం ఒక్కటీ చేయలేదు. ఇలా 100 రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో చంద్రబాబును, లోకేష్‌ను మాటలతో పైకి ఎత్తడం మినహా నియోజకవర్గానికి ఎమ్మెల్యే చేసిన మేలు ఏమీలేదు. పాత చింతకాయ పచ్చడిలా ఊకదంపుడు ఉపన్యాసాలకే ఎమ్మెల్యే పరిమితమయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు.

కుళాయి నీరు అందని ద్రాక్షే

హామీలను అటకెక్కించిన ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరు నియోజకవర్గ ప్రజలకు పలు హామీలిచ్చారు. ఆయన గెలిచి ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులైనా ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదు. ప్రధానంగా తిరువూరు పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నందున శాశ్వత పరిష్కారానికి నిధులు తెస్తానని, అన్ని వార్డుల్లో సమృద్ధిగా తాగునీరందిస్తానని హామీ ఇచ్చారు. ఇంతవరకు ఈ హామీ అమలుకు నోచలేదు. ఇప్పటికీ కుళాయి నీరు అందని ద్రాక్షగా మిగలగా, ట్యాంకర్లతో మొక్కుబడిగా మంచినీరందిస్తున్నారు.

- గంపలగూడెం మండలంలోని వినగడప వద్ద కట్టలేరుపై గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వరదలకు కొట్టుకుపోయిన వంతెన, అప్రోచ్ రహదారుల నిర్మాణాన్ని తాను ఎన్నికైన వెంటనే పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఆ మండల ప్రజలకు హామీ ఇచ్చారు. ఇంతవరకు ఆ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు.
- ఎ.కొండూరు మండలంలోని గిరిజన తండాలకు కృష్ణా జలాలను సరఫరా చేయిస్తానని, అన్ని గ్రామాల్లో ఆర్‌ఓ ప్లాంట్లు నిర్మిస్తామన్న హామీ నెరవేరలేదు. ఇప్పటికీ కృష్ణా నదీ జలాలను రేపూడి నుంచి ట్యాంకర్లతో తండాలకు పంపుతున్నారు.
- తిరువూరులో నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తానని, డీఎస్సీ అభ్యర్థులకు ముందుగా శిక్షణ ప్రారంభిస్తామని మూడు నెలల కిందట చెప్పిన ఎమ్మెల్యే ఇంతవరకు ఈ కేంద్రాన్ని ప్రారంభించలేదు.
- తిరువూరు శివారు పీటీ కొత్తూరులో 1200 కుటుంబాలకు గత తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన టిడ్కో ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోగా, వాటిని పూర్తి చేస్తామని ఎమ్మెల్యే శ్రీనివాసరావు వాగ్దానం చేశారు. ఇంతవరకు వీటి పనులు ప్రారంభించలేదు.
- తిరువూరులో వ్యవసాయాధారిత ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు తెస్తామని చెప్పినప్పటికీ ఇంతవరకు ఆ దిశగా ఎటువంటి ప్రయత్నాలు జరగలేదు.



తిరువూరులో టిడ్కో ఇళ్ల సముదాయం

వంద శాతం వంచన

నూజివీడు: ఎన్నికల సమయంలో కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి ఎన్నో హామీలిచ్చారు. వాటిలో ముఖ్యంగా 16 హామీలపై విస్తృతంగా ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి కూడా అయ్యారు. అధికారం చేపట్టి 100 రోజులైనప్పటికీ ఒక్కటంటే ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. మూడు నెలలు దాటినా హామీలలో ఏ ఒక్కటీ అమలుకు నోచుకోకపోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారంటూ ప్రశ్నిస్తున్నారు.

ఇచ్చిన హామీలు ఇవి..

- నూజివీడు – విజయవాడ రహదారి నాలుగు లైన్ల రహదారిగా అభివృద్ధి.
- నూజివీడు పట్టణానికి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సదుపాయం.
- నూజివీడు పట్టణంలో రోడ్ల విస్తరణ, అభివృద్ధి. పట్టణంలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు పార్కుల అభివృద్ధి.
- మాజీ ఎమ్మెల్యే కోటగిరి హనుమంతరావు, మాజీ మంత్రి ఎమ్మార్ అప్పారావు విగ్రహాలను ఏర్పాటు చేసి సర్కిళ్లను అభివృద్ధి చేయడం.
- నూజివీడు పట్టణంలో ఇండోర్ స్టేడియం అభివృద్ధికి చర్యలు.
- నూజివీడు పట్టణానికి చుట్టూ రింగ్ రోడ్డు ఏర్పాటు.
- ఆగిరిపల్లి మండలం తోటపల్లి వద్ద ఉన్న బ్రహ్మలింగం చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం.
- చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి నూజివీడు ప్రాంతానికి రబీలో సాగునీరు అందించడం.
- అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాల నిర్మాణం ఆరు నెలల్లో పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయడం.
- నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపడం.
- మామిడి రైతులకు ప్రయోజనం కల్పించేందుకు నూజివీడులో మామిడి మార్కెట్ ఏర్పాటు చేయడం.
- పెద్ద చెరువు, మొఘల్ చెరువుల్లో ఆక్రమణలను తొలగించడం. మొఘల్ చెరువుకు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం.
- నూజివీడు గాంధీనగర్‌లో ఉన్న స్టేడియం స్థలంలో ప్రజల ప్రయోజనార్థం వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్ పార్కు, షటిల్, వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేయడం.
- చాట్రాయి మండలం పిట్టలవారిగూడెం వద్ద రైతుల ప్రయోజనార్థం సాగునీరు నిమిత్తం ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయడం.
- నూజివీడు పట్టణంలో పలు ప్రాంతాల్లో సీసీ డ్రెయిన్లు నిర్మించడం.



అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చిన నూజివీడులోని మొఘల్ చెరువు

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం

తిరువూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం తీసుకుంటే గర్భిణులకు పుట్టబోయే బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ తిరువూరు ప్రాజెక్టు సీడీపీఓ సత్యవతి అన్నారు. తిరువూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాల నిర్వహణలో భాగంగా తిరువూరు 12,13,14,15 వార్డుల్లో శుక్రవారం గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. పౌష్టికాహార లోపంతో కలిగే ఇబ్బందులపై అవగాహన సమావేశాలు ఏర్పాటు చేశారు. మాతా, శిశు మరణాలు తగ్గించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని అందిస్తోందని సీడీపీఓ వివరించారు. తిరువూరు సెక్టార్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, టాటా ట్రస్ట్ ప్రోగ్రాం అసోసియేట్ రమేష్, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు రమాదేవి, సువర్ణరాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సీమంతాలు చేశారు. నీతి ఆయోగ్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జహీదా, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



తిరువూరులో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సీడీపీఓ సత్యవతి



కొటికలపూడిలో గర్భిణులకు సీమంతాలు

పౌష్టికాహారంపై అవగాహన

చాట్రాయి: పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రీదేవి అన్నారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవంలో ఆమె మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడని చెప్పారు. ఏపీఎం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపిక

నూజివీడు: ఎస్ఆర్ఆర్ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో పట్టణానికి చెందిన త్రివిధ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీ అండర్-17 విభాగంలో తేజ, హేమచంద్, చెస్ సీనియర్ విభాగంలో వెంకటరామ్‌సాయి, లియో, జూనియర్ విభాగంలో ఆర్ వంశీ, అమిత్ శామ్యూల్, వాలీబాల్ అండర్-17 విభాగంలో వంశీ, అండర్-14 విభాగం యోగాలో రాజా, ఖోఖో అండర్-17 విభాగంలో ఎస్. ప్రణవ్, అండర్-14 విభాగంలో నవతేజ్, షటిల్ అండర్-17 విభాగంలో వైజే దుర్గాప్రసాద్, నాగకౌశిక్‌లు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఉపాధ్యాయులకు లెసన్ ప్లాన్ తప్పనిసరి

నూజివీడు: ఉపాధ్యాయులు తప్పనిసరిగా లెసన్ ప్లాన్ రాయాలని సమగ్ర శిక్షా ఏఎంఓ రెడ్డి రామారావు అన్నారు. నూజివీడు డివిజన్ పరిధిలోని అన్ని యాజమాన్యాలకు చెందిన హైస్కూల్ హెచ్ఎంలకు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రింటెడ్ లెసన్ ప్లాన్‌లు వాడకూడదని, తప్పనిసరిగా సొంతంగా రాసుకోవాలని సూచించారు. పరీక్షలకు ముందుగానే సిలబస్‌ను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని, ప్రతి ఉపాధ్యాయుడు నిత్యం డైరీ రాయాలని చెప్పారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీవైఈఓ ఎం. సేవియా, ఎంఈఓ-2 జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

24న మండల పరిషత్ సమావేశం

తిరువూరురూరల్: తిరువూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 24న మధ్యాహ్నం 2.30 గంటలకు జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు గద్దల భారతి అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలంలోని పలు సమస్యలపై, ఎంపీటీసీ సభ్యులు ప్రతిపాదించిన అంశాలపై చర్చించనున్నామని చెప్పారు.

కిశోర బాలికలకు రక్త పరీక్షలు

తిరువూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న కిశోర బాలికలకు తిరువూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రేష్మాబేగం ఆధ్వర్యంలో రక్తపరీక్షలు చేశారు. విద్యార్థినులకు ప్రతి వారం ఐరన్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 10 నుంచి 19 సంవత్సరాల లోపు బాలికల్లో రక్తహీనతను గుర్తించేందుకు హిమోగ్లోబిన్ శాతం పరీక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఆర్మీ వింగ్‌కు 35 మంది ఎంపిక

మైలవరం: రక్షణ దళం, దేశ సరిహద్దులకు స్త్రీలకు ఎన్‌సీసీ విభాగం ద్వారా మంచి అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలంధర్‌సింగ్ అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ ఆర్మీ వింగ్ సెలక్షన్స్ శుక్రవారం నిర్వహించారు. దేహ దారుఢ్యం, ప్రతిభ ఆధారంగా కళాశాలలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న 35 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. బలంధర్‌సింగ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా మంచి క్రమశిక్షణ, నిబద్ధత, నడత అలవాడతాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, ఆర్మీ ఆఫీసర్ సురేష్ పాల్గొన్నారు.

జీవశాస్త్రంలో నవీన పోకడలపై సదస్సు

మైలవరం: జీవశాస్త్రంలో నవీన పోకడలు వినియోగించుకుని జీవుల అభివృద్ధికి కృషి చేయాలని వృక్షశాస్త్ర విభాగాధిపతి జె. రాముడు అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీవశాస్త్రంలో నవీన పోకడలు అంశంపై శుక్రవారం ఒక రోజు జాతీయ సదస్సు ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అధ్యక్షతన జరిగింది. రాముడు మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో క్రమానుగుణంగా జీవ సంపద కోల్పోతున్నామన్నారు. వివిధ కారణాల వలన కోల్పోతున్న జీవ సంపదను భావితరాలకు అందించాలన్నారు. వాతావరణంలో వివిధ రకాలైన వాయువులు విడుదలవుతున్నాయని, వాటి వలన జీవసంపదకు ముప్పు ఉందని, తుపానులు, వరదలు వచ్చి భూమి మీద జీవ సంపద ప్రమాదంలోకి నెట్టివేయబడుతుందని వివరించారు. మద్రాస్ సెంట్రల్ యూనివర్సిటీ వృక్ష శాస్త్ర పూర్వ విభాగపు అధిపతి ప్రొఫెసర్ మతివానన్, ఢిల్లీ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎంవీ రాజం, బుందేల్కండ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ దేశ్‌ముఖ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రెడ్డి, కృష్ణా యూనివర్సిటీ ప్రొఫెసర్ పీవీ బ్రహ్మచారి, నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ఎం ఖాసీం, బ్యాంకాక్ మహిడాల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కంచిత్ తమ్మసిరి తదితరులు ప్రస్తుతం జీవశాస్త్రంలో జరుగుతున్న అంశాలపై తమ పరిశోధనలను వివరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

పోలీసుల హెచ్చరిక

తిరువూరు: తిరువూరు పరిసరాల్లో చైన్‌స్నాచర్లు ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ ధరించి నేరాలకు పాల్పడుతున్నందున మహిళలు అప్రమత్తంగా ఉండాలని తిరువూరు సీఐ గిరిబాబు హెచ్చరించారు. తిరువూరు సమీపంలోని పెనుబల్లి మండలం ముత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి వద్ద పొలం పనులకు వెళుతున్న మోదుగు కుమారి మెడలో బంగారు గొలుసును ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు తెంపుకెళ్లారని సీఐ తెలిపారు. కుప్పెనకుంట్ల సమీపంలో కూడా మరో ద్విచక్రవాహనంపై వెళుతున్న కె. పద్మాలక్ష్మి మెడలోని బంగారు గొలుసును కూడా ఈ నిందితులు తెంచుకువెళ్లారని, ఒకే రోజు పలు చోట్ల నేరాలకు పాల్పడిన నిందితుల ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ ఘటనలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ పోలీసులు మైకు ప్రచారం నిర్వహిస్తున్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

జి.కొండూరు: వివాహిత అదృశ్యంపై జి.కొండూరు పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగపాడు గ్రామంలో నివాసం ఉంటున్న చల్లా జమలమ్మ (35), చల్లా శ్రీను దంపతులు. 18 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గత కొంతకాలంగా భార్య, భర్త తరచూ గొడవ పడుతూ ఉండేవారు. వీరు ఇరువురు గతంలో ఒకరిపై ఒకరు జి.కొండూరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీన రాత్రి భర్త శ్రీనుతో గొడవ పడిన జమలమ్మ తీవ్ర మనస్తాపానికి గురై 11వ తేదీన ఉదయం 7 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు జమలమ్మ ఆచూకీ కోసం ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె కుమారుడు ఆనంద్ గురువారం జి.కొండూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్ఐ సతీష్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు.

ఎమ్మెల్యే వసంతను కలిసిన వెస్ట్ జోన్ ఏసీపీ దుర్గారావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వెస్ట్ జోన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)గా ఇటీవల నియమితులైన ఎస్ఎస్‌వీకే దుర్గారావు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లిన ఏసీపీ దుర్గారావు ఎమ్మెల్యే వసంతకు పుష్పగుచ్ఛం అందజేశారు.

23, 24 తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు

గంపలగూడెం: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23, 24 తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తామని ఎంఈఓ నరసింహారావు తెలిపారు. గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, షటిల్, యోగా, చదరంగం అంశాల్లో పోటీలు నిర్వహిస్తారన్నారు. 23న అండర్ 14, అండర్ 17 బాలికలకు, 24న అండర్ 14, అండర్ 17 బాలురకు పోటీలు జరుగుతాయని, వ్యాయామోపాధ్యాయులు తమ పాఠశాలల క్రీడాకారులను క్రీడా ప్రాంగణానికి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం తీసుకురావాలని సూచించారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్

ఇబ్రహీంపట్నం: మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్ శనివారం నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు నిర్వహిస్తామని ఎస్‌జీఎఫ్ మండల ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల అండర్ 14, 17 విభాగంలో కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాలలో 21న జరుగుతాయన్నారు. 24వ తేదీన అండర్ 14, 17 విభాగం బాలురకు కొండపల్లి జెడ్పీ బాలుర పాఠశాలలో ఏర్పాట్లు చేశామన్నారు. పీఈటీలు, పీడీలు క్రీడా పోటీలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు.

బాల్య వివాహాలను అరికడదాం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): బాల్య వివాహాలు అరికడదామని కొండపల్లి మాజీ సర్పంచి వెనిగళ్ల అమ్మాజీ అన్నారు. మహిళా శిశు సంక్షేమ, చైల్డ్ ప్రొటెక్షన్ సంస్థల ఆధ్వర్యంలో కొండపల్లి క్రాంతి హైస్కూల్‌లో ఆడపిల్లలను పుట్టనిద్దాం, ఎదగనిద్దాం, బతకనిద్దాం, చదవనిద్దాం అనే అంశాలపై తల్లిదండ్రులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలను అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. చైల్డ్ ప్రొటెక్షన్ సంస్థ అధికారి దుర్గాప్రసాద్, స్త్రీ సంక్షేమ శాఖ సూపర్‌వైజర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగుల వినతి

ఇబ్రహీంపట్నం: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఇంజినీర్ల సంఘం నాయకులు రాష్ట్ర విద్యా, ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్‌ను కోరారు. ఈ మేరకు సచివాలయంలోని ఆయన చాంబర్‌లో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వేతన సవరణలో ఉద్యోగులకు జరిగిన అన్యాయం మంత్రికి వివరించారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల నియామకాలు చేపట్టాలని కోరారు. ఉద్యోగుల సమస్యలపై మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించినట్లు ఇంజినీర్ల సంఘం నాయకుడు రామారావు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో నాగబాబు, చక్రపాణి, బాలాప్రసాద్, వెంకటేష్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.